సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం, 6, జూన్, 2025



సొంతింటి కల.. నెరవేరేలా!

తానే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి, ఆ తర్వాత బిల్లులు తీసుకునేందుకు ఓ కాంట్రాక్టర్ అంగీకరించినట్లు తెలిసింది. 10లో



ప్రకృతిని కాపాడుకుందాం..

ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకుందామంటూ జిల్లావ్యాప్తంగా పలువురు ర్యాలీలు జరిపారు. మొక్కలు నాటారు. 11లో

గరిష్టం / కనిష్టం
37° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, అర్చకులు, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

ఎన్‌సీసీ పరీక్షలో నూరుశాతం ఉత్తీర్ణత



ఎన్‌సీసీ అధికారులతో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల(దమ్మపేట)లోఎన్‌సీసీ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో 33 మంది విద్యార్థినులు ఉండగా, జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో అందరూ ఉత్తీర్ణత పొందారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ వి. స్పందన గురువారం వివరాలు వెల్లడించారు. కొణిజర్ల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు ఖమ్మం బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ భద్ర చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ కె.సింధు శ్రీ, సీటీఓ ఆఫీసర్ ఎం.అరుణ, సిబ్బంది భువన, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

వెంకన్న సన్నిధిలో పాలకుర్తి ఎమ్మెల్యే పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డితో కలిసి గురువారం దర్శించుకున్నారు. శ్రీవారికి, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ అందజేశారు.



తీగ లాగారు... డొంక కదులుతోంది..

- సింగరేణిలో ఉదారంగా కారుణ్య నియామకాలు
- ఉద్యోగాలు ఇప్పిస్తామని కార్మిక కుటుంబాలపై వల
- ఏడాదిన్నరగా మెడికల్ దందాపై నజర్
- దాడులు, అరెస్టులు మొదలు పెట్టిన ఏసీబీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర పారిశ్రామిక అవసరాలను తీరుస్తూ నలుదిశలా విస్తరిస్తున్న సింగరేణి సంస్థలో కొన్నేళ్లుగా అవినీతి జాడ్యం వేళ్లూనుకుంది. ఈ నేపథ్యంలో యాజమాన్యంతోపాటు సీఐడీ, ఏసీబీ వంటి సంస్థలు దృష్టి సారించడంతో మెడికల్ బోర్డులో చాప కింద నీరులా విస్తరించి సంస్థకు చెడ్డ పేరు తెస్తున్న మాఫియా చుట్టూ క్రమంగా ఉచ్చు బిగుస్తోంది. సింగరేణిలో సంస్థలో 90వ దశకంలో రద్దయిన వారసత్వ ఉద్యోగాలు తెలంగాణ ఉద్యమ సమయంలో తెర మీదకు వచ్చాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తే.. చట్టపరమైన చిక్కులు ఎదురయ్యాయి. దీంతో అనధికారిక ప్రత్యామ్నాయంగా 2017 నుంచి కారుణ్య నియామకాలు చేపడుతున్నారు. కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని 'సొమ్ములిస్తేనే ఉద్యోగాలు వస్తాయి'అంటూ సంస్థలోని ఓ 'సిండికేట్' ప్రచారం చేసింది. చివరకు ఈ ప్రచారమే స్థిరపడిపోగా, ఒక్కో ఉద్యోగానికి కార్మికుల నుంచి కనిష్ఠంగా రూ. ఐదు లక్షల వరకు సిండికేట్ వసూళ్లు చేస్తోంది.

ఏడాదిన్నరగా..

గతేడాది జనవరిలో మెడికల్ బోర్డులో అవినీతి వ్యవహారంపై సంస్థ దృష్టి సారించింది. కారుణ్య నియామకాల్లో జరిగే అక్రమాలపై నజర్ పెట్టాలని సీఐడీ, ఏసీబీలను కోరుతూ 2024 జనవరిలో లేఖలు రాసింది. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలంటూ సంస్థ కోరింది. అప్పటికే ఆరేడేళ్లుగా ఈ దందా సాగుతుండటంతో ఫిర్యాదులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గతేడాది మే నెలలో మెడికల్ బోర్డు అవినీతిపై కచ్చితమైన సమాచారం అందిస్తే రూ.10 వేల నగదు బహుమతి అందిస్తామని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సంస్థ పేర్కొంది. అవినీతి వివరాలు తెలిపేందుకు ప్రత్యేకంగా 94911 44104 వాట్సాప్ నంబరును అందుబాటులోకి తెచ్చింది. ఆరంభంలో ఆశించిన స్పందన రాకున్నా క్రమంగా ఈ నంబరుకు ఫిర్యాదులు రావడం మొదలైంది.

సిండికేట్‌లో ప్రకంపనలు

అన్నెబోయిన రాజేశ్వరరావు సింగరేణి ఉద్యోగి కాగా గురువారం ఏసీబీ అధికారులు విచారిస్తున్న మహిళకు సింగరేణితో సంబంధం లేదు. ఇక్కడ మరింత లోతుగా విచారణ చేయగా కారుణ్య నియామకాల పేరుతో జరుగుతున్న అవినీతి వ్యవహారంలో సింగరేణి ఉద్యోగులతో పాటు ఔట్ సోర్సింగ్/ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నట్టు తేలింది. దీంతో సంస్థలో పని చేస్తూ అక్రమాలకు పాల్పడిన వారి పేర్లతో కూడిన జాబితా ఇప్పటికే సిద్ధమైనట్టు తెలుస్తోంది. డబ్బులిస్తే కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు దండుకుంటున్న సంస్థేతర వ్యక్తులకు సంస్థలో ఉన్న ఉద్యోగులకు మధ్య జరిగిన లావాదేవీలపై పక్కా ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. దీంతో కారుణ్య నియామకాలతో సంబంధం కలిగి 'సిండికేట్' పనులు చక్కబెట్టిన వారిలో ప్రకంపనలు పుడుతున్నాయి. ఈ సిండికేట్‌కు సూత్రధారిగా ఉంటూ సంస్థను భ్రష్టు పట్టించేందుకు నిత్యం ప్రయత్నిస్తున్న ఓ మాజీ ఉద్యోగిపై వీరంతా గుర్రుగా ఉన్నారు. గతంలో అతనితో జరిపిన లావాదేవీలకు సంబంధించి ఆధారాలను చెరిపేసే పనిలో ఉన్నట్టు సమాచారం. కాగా ఏసీబీ యాక్టివ్ కావడంతో సిండికేట్ చేతిలో మోసపోయిన వారు మరిన్ని ఆధారాలతో ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పక్కా సమాచారంతో..

వేర్వేరు ఫోన్ కాల్స్ ద్వారా అందిన సమాచారాన్ని విశ్లేషించి, పక్కా ఆధారాలతో ఈ ఏడాది మే 6న మెయిన్ వర్క్‌షాపులో పని చేస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావు అనే ఉద్యోగిని ఏసీబీ అధికారులు టార్గెట్ చేశారు. అతని బ్యాంకు ఖాతాల్లో రూ.32 లక్షల నగదు ఉన్నట్టుగా గుర్తించారు. అతన్ని విచారిస్తే లభించిన సమాచారం, అప్పటికే తమ దగ్గరున్న వివరాలు, ఫిర్యాదుదారులు చెప్పిన అంశాలను బేరీజు వేసుకుని సరిగ్గా నెల రోజుల తర్వాత గురువారం కొత్తగూడెం పట్టణంలో మరో మహిళ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ప్రస్తుతం ఆమె నుంచి వివరాలు రాబట్టే పని చేస్తున్నారు.

'దబ్బతోగు'కు మరమ్మతులేవి..?



పూడిక పేరుకుపోయిన దబ్బతోగు ప్రాజెక్ట్

- 25 ఏళ్ల క్రితం సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణం
- దెబ్బతిన్న తూములు, షట్టర్లు, గైడ్‌వాల్
- పూడిక పేరుకుపోయి నీటి నిల్వ తగ్గిన ప్రాజెక్ట్



తుప్పపట్టి శిథిలావస్థలో ఉన్న తూము షట్టర్

అశ్వారావుపేటరూరల్: వందలాది ఎకరాలకు సాగునీరు అందించే దబ్బతోగు ప్రాజెక్టు అధ్వాన్న స్థితికి చేరింది. ప్రాజెక్ట్ నిర్మించి పాతికేళ్లు కాగా, పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచుకోవడం లేదు. శిథిలమై, తుప్పుపట్టిన షట్టర్ల కారణంగా పంటలకు అందాల్సిన సాగునీరు లీకులై వృథాగా పోతోంది. దీంతో సాగునీరు అందక ఆయకట్టు రైతాంగం ఆవేదన చెందుతోంది.

25 ఏళ్ల క్రితం నిర్మాణం

అశ్వారావుపేట మండలం దబ్బతోగు గ్రామంలో 2000వ సంవత్సరంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ నిర్మించారు. దీంతో దబ్బతోగు, దబ్బతోగు కాలనీ, వినాయకపురం కాలనీ, మల్లాయిగూడెం, నారాయణపురం కాలనీ గ్రామాల పరిధిలో సుమారు 900 ఎకరాలకు సాగునీరు అందింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో భాగంగా ఎనిమిదేళ్ల క్రితం పూడిక తీసే పనులు, అలుగుకు మరమ్మతులు చేసి వదిలేశారు. ఆ తర్వాత మళ్లీ మరమ్మతులు చేపట్టలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమంలో కూడా ఈ ప్రాజెక్టును ఎంపిక చేయలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుప్పు పట్టిన షట్టర్లు.. నీటి లీకేజీ

దబ్బతోగు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల షట్టర్లు తుప్పు పట్టి శిథిలావస్థలో ఉన్నాయి. షట్టర్లు లీకై నిల్వ ఉన్న సాగునీరు వృథాగా పోతోంది. తక్షణం మరమ్మతులు చేపట్టకపోతే వర్షాకాలంలో అడ్డుకట్ట వేయడం కూడా సాధ్యం కాదని రైతులు పేర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే లీకేజీలతో సాగునీరు మొత్తం వృథాగా పోతుందని చెబుతున్నారు. షట్టర్ల కోసం నిర్మించిన కాంక్రీట్ గోడలకు సైతం బీటలు ఏర్పడ్డాయి. మరో వైపు ప్రాజెక్ట్‌లో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గిపోతోంది.

ధ్వంసమైన గైడ్ వాల్

గతేడాది జూలై 18వ తేదీ నుంచి కురిసిన అతి భారీ వర్షాల కారణంగా దబ్బతోగు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా ప్రాజెక్ట్‌లోకి వరదనీరు పోటెత్తడంతో అలుగు ఉధృతంగా పొంగి దిగువన ఉన్న గైడ్‌వాల్ పూర్తిగా ధ్వంసమైంది. అలుగు దిగువన భారీగా మట్టి కోతకు గురి కాగా, ఐదు అడుగుల మేర భారీ గంతలు పడ్డాయి. ఈ ఏడాది మళ్లీ భారీ వర్షాలు కురిస్తే ప్రాజెక్ట్ మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని, ఆనకట్టపై చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

దబ్బతోగు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందించాం. కానీ ఇంకా నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. అలుగు గైడ్ వాల్ మరమ్మతులు వచ్చే ఏడాది చేస్తాం.

-కృష్ణ, డీఈఈ, అశ్వారావుపేట

చెట్లు నరికితే కఠిన చర్యలు

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మణుగూరులో మొక్క నాటుతున్న సింగరేణి అధికారులు



జెండా ఊపి గ్రీన్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి/పాల్వంచరూరల్: చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. పాల్వంచ మండలం బస్వతారాకకాలనీ పంచాయతీ అర్బన్ పార్కులో, కొత్తగూడెంలోని అటవీశాఖ వన విహార్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా అటవీశాఖాధికారి జి.కిష్టాగౌడ్‌తో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. కొత్తగూడెంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సెంట్రల్ పార్క్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమంలో, ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్లను నరుకుతూ పోతే భవిష్యత్‌లో ఎలాంటి ఫలసాయం అందుబాటులో ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. జిల్లా అటవీశాఖాధికారి కిష్టాగౌడ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా మానివేయాలన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ కొత్తగూడెం డివిజన్ కార్యాలయంలో సీజీఎం వీవీ రెడ్డి, డీఎంలు చంద్రమోహన్, కవిత తదితరులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి, కోటేశ్వరరావు, పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్, కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసబాబు, ప్రభాకర్‌రావు, రేంజర్లు సురేష్, రవికిరణ్, ఏ.కరుణాకరాచారి, డిప్యూటీ రేంజర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్‌అధికారులు, సింగరేణి ఎన్విరాన్‌మెంట్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

మణుగూరు రూరల్: ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించాలని సింగరేణి డైరెక్టర్(పిఅండ్‌పి, పా) కె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. బంగ్లాస్ ఏరియాలో మొక్కలు నాటారు. అనంతరం ఏరియా అధికారులతో కలిసి ఓసీ–2 వ్యూపాయింట్‌కు చేరుకుని బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో, నివాస స్థలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచాలన్నారు. ఏరియా జీఎం కార్యాలయ ఆవరణంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ మొక్కలు నాటారు. అనంతరం వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు జ్ఞాపికలు, జూట్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమాలల్లో ఎస్‌డీఓ సయ్యద్ మక్సూద్ మొహియుద్దీన్, జీఎంలు డి.వెంకటేశ్వర్లు, తిరుమల రావు, ఇతర అధికారులు శ్యాంసుందర్, ఆర్.శ్రీనివాస్, కేశవరావు, వెంకట్రావు, అనురాధ, మదన్ నాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో శుక్రవారం నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరా చారి తెలిపారు. గురువారం డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బడిబాటలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాలని ఆదేశించారు. ఆరో తేదీ నుంచి 19వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహించాలని, పాఠశాలల్లో పిల్లలను చేర్పి, వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు, మండల అభివృద్ధి అధికారుల సహకారంతో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను, గ్రామ పెద్దలను, ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు.

గిరిజన వంటకాలు రుచి చూపించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఆవరణలోని గిరిజన మ్యూజియానికి వచ్చే సందర్శకులు గిరిజన వంటకాల రుచి చూపించాలని, సరసమైన ధరలకు విక్రయించాలని పీఓ బి.రాహుల్ అన్నారు. ఆర్.కొత్తగూడెం శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లయబిలిటీ గ్రూప్, గిరిజన గ్రూప్ మహిళలు తయారుచేసిన ఇప్పపువ్వు లడ్డూతోపాటు ఇతర ఆహార పదార్థాలను గురువారం ఆయన తన చాంబర్‌లో రుచి చూశారు. తయారు చేసే ప్రతీ వస్తువు నాణ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, ముత్యాలమ్మ లియాబిలిటీ గ్రూప్ మహిళలు సున్నం సమ్మక్క, సున్నం శిరీష, సోడే మున్ని, వేల్పుల దేవి, సున్నం స్వాతి, రమాదేవి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పీఓకు అందజేస్తున్న గ్రూప్ సభ్యులు

బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని అర్హులైన గిరిజన విద్యార్థులకు 3, 5, 8వ తరగతులలో 2025– 26 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతికి 38, 5వ తరగతికి 20, 8వ తరగతికి 19 సీట్లు.. మొత్తం 77 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, 20న ఐటీడీఏ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపికలు నిర్వహిస్తామని వివరించారు.


మన్మోహన్ సింగ్ 'ఎర్త్ సైన్సెస్'

- కొత్తగూడెం వర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు
- తెలంగాణ కేబినెట్ సమావేశంలో లభించిన ఆమోదం
- జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇటీవల మంజూరైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. దీంతో జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో మొదటిది

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్‌గా 50 ఏళ్ల క్రితం 300 ఎకరాల్లో మొదలై యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ (కాకతీయ)గా అప్‌గ్రేడ్ చెందిన కేఎస్‌ఎం ప్రస్థానంలో మరో ఎత్తుకు చేరుకుంది. ఇటీవల ఈ కాలేజీని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఇప్పుడీ కాలేజీకి ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరును పెట్టింది. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషించనుంది. ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులను అమలుతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది.



ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం

అందించే కోర్సులు

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కావడంతో దేశ విదేశాల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు ఇక్కడకు వచ్చే అవకాశముంది. కాలేజీ రాకతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వేలాదిమంది విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతోపాటు శాస్త్రవేత్తలుగా తయారుచేసే అవకాశాలు ఉన్నాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మోరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

అన్నీ అనుకూలతలే..


దక్షిణ భారతదేశంలో ఖనిజనిధిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పేరుంది. ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అన్ని అనుకూల వసతులు ఉన్నాయి. నేషనల్ హైవేకు సమీపంలో వర్సిటీ ఏర్పాటు చేస్తున్నారు. విశ్వవిద్యాలయం సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నవభారత్ లిమిటెడ్, ఫెర్రో అల్లాయిస్, ఫెర్రో మెగ్నీషియం, విద్యుత్ ప్లాంట్‌లు కూడా ఉన్నాయి. జిల్లాలో ఐటీసీ పేపర్ బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్ ఉండగా, ఇక్కడికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఈ కల నెరవేరనుంది. రోడ్డు, రైలు రవాణా మార్గాలు అతి సమీపంలో ఉన్నాయి. 35 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తోంది. దీనివల్ల భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు ఉండవు. ఇలా కొత్తగూడేనికి ఉన్న అనుకూలతలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని మంజూరు చేయించేందుకు మంత్రి తుమ్మల నిర్విరామంగా కృషి చేశారు. ఇప్పుడు మన్మోహన్‌సింగ్ పేరు పెట్టడంతో వర్సిటీపై దేశవ్యాప్తంగా చర్చ జరగనుంది.

కళకళలాడనున్న క్యాంపస్

గ్రాడ్యుయేషన్‌లో జియోలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ కోర్సులు ఉండగా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో జియోలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో కెమిస్ట్రీ అందుబాటులోకి తేనున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకు పీహెచ్‌డీ చేయొచ్చు. ఇప్పటికే క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్, కంప్యూటర్‌సైన్స్, ఈఈఈ, ఈసీఈ, ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో ప్రతీ కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లు ఇక్కడ అందుబాటులో ఉండగా ఎర్త్ సైన్సెస్ సబ్జెక్టులు రావడంతో ఈ సంఖ్య రెట్టింపు కానుంది.

ఫుడ్ కోర్టు పూర్తయ్యేనా..?

- కిన్నెరసానిలో అసంపూర్తిగా నిలిచిన భవనం
- పర్యాటకులకు అల్పాహారం కూడా దొరకని దుస్థితి



కిన్నెరసాని డ్యామ్‌వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన ఫుడ్ కోర్టు నిర్మాణం

పాల్వంచరూరల్: పర్యాటకుల కోసం కిన్నెరసాని డ్యామ్ పక్కన చేపట్టిన ఫుడ్ కోర్టు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కిన్నెరసానిలో 9 కాటేజీలు, అద్దాలమేడ, ఫుడ్ కోర్టు నిర్మాణంకోసం 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10.77 కోట్లు మంజూరు చేశారు. ఆపసోపాలతో కాటేజీలు, అద్దాలమేడ నిర్మాణ పనులు పూర్తిచేసిన అధికారులు ఫుడ్ కోర్టును మాత్రం నిర్లక్ష్యంగా వదిలేశారు. గతంలో చెక్కతో ఫుడ్ కోర్టు నిర్మించారు. దానిని కూల్చివేసి రెండు అంతస్తుల భవనం నిర్మించాలని పనులు ప్రారంభించారు. నిధులేమితో అర్ధంతరంగా నిలిపివేశారు. మరోవైపు డ్యామ్‌పైకి వచ్చిన పర్యాటకులకు టీ, అల్పాహారం కూడా దొరకడంలేదు. ఇప్పటికైనా టూరిజం శాఖ అధికారులు స్పందించి ఫుడ్ కోర్టు నిర్మాణం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా నిధుల లేమి కారణంగా ఫుడ్ కోర్టు నిర్మాణ పనులను నిలిపివేయాల్సి వచ్చిందని టూరిజంశాఖ డీఈ రవీందర్ తెలిపారు.

క్లుప్తంగా

క్లినిక్‌ల ధరలు తగ్గిస్తూ ఉత్తర్వులు

భద్రాచలం అర్బన్: ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటున్న నేపథ్యంలో గత నెల 26న ప్రచురితమైన 'దేవుడా ఇదేం పరీక్ష' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ధరలు తగ్గిస్తూ ఐటీడీఏ పీఓ రాహుల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ..



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

భద్రాచలం అర్బన్: భద్రాచలం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈమేరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ నర్సింగ్‌హోమ్‌కు రూ.లక్ష జరిమానా విధించారు. అంతేకాక మరికొన్ని ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. నిబంధనలకు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. కాగా, ఈ తనిఖీ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా.. సీజ్ చేయాల్సిన సదరు ఆస్పత్రిని ఓ రాజకీయ నాయకుడి అండతో అధికారులు జరిమానాతో సరిపుచ్చినట్లు సమాచారం.

ఆర్టీసీ డ్రైవర్‌కు రివార్డు



రివార్డు అందుకుంటున్న మహేశ్

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మహేశ్ ఇటీవల అమలాపురం డ్యూటీకి వెళ్లి వస్తున్న క్రమంలో బస్సులో ఓ ప్రయాణికుడు మర్చిపోయిన రూ.లక్షను అదేరోజు డిపోలో అందించాడు. ఈ మేరకు మహేశ్ నిజాయితీని గుర్తించిన ఆర్టీసీ అధికారులు గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్ చేతులమీదుగా రాష్ట్ర ఆర్టీసీ సేవా రివార్డ్‌ను అందజేసి ఘనంగా సన్మానించారు.

ఏబీడీసీ డ్రైవ్‌లు నిర్వహించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ఏబీడీసీ డ్రైవ్‌లు నిర్వహించాలని కలెక్టరేట్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏబీడీసీ డ్రైవ్, భూభారతి రెవెన్యూ సదస్సులు, బక్రీద్ పండుగ ఏర్పాట్లు, ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా, బడిబాట గ్రామసభల నిర్వహణ, వనమహోత్సవ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డ్రైవ్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అజోల్లా పెంపకం, బయోచార్, కంపోస్టింగ్, డిగ్గింగ్ సోక్ పిట్, పామ్ పాండ్ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

మేడేపల్లి పంచాయతీకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి రమ్య

ముదిగొండ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలపరిధిలోని మేడేపల్లి గ్రామపంచాయతీ రాణించడంతో రాష్ట్రస్థాయి అవార్డు ఎంపికైంది. పర్యావరణం పరిరక్షణకు అమలు చేసిన విధానాలు, సేంద్రియ ఎరువు తయారీ, తడి,పొడి చెత్త వేరు చేయడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి అంశాలను అమలు చేసినందుకు గాను ఎంపికై ంది. ఈమేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని టీజీపీసీబీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి రమ్య గురువారం పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. దీంతో మండల అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, రూ.100 వెరిఫికేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

సొంతింటి కల.. నెరవేరేలా!



కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన అవగాహనకు హాజరైన లబ్ధిదారులు

- మూకుమ్మడిగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- ఇల్లెందులో కట్టడానికి ముందుకొచ్చిన కాంట్రాక్టర్
- పనుల అప్పగింతకు 357 మంది లబ్ధిదారుల నిర్ణయం

ఇల్లెందు: గత ప్రభుత్వ హయాంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామంటే పేదలు తమ కష్టాలు తీరినట్లేనని భావించారు. కానీ చాలామంది కలలు తీరకుండానే ఆ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ఆతర్వాత అధికారంలోకి కొలువుదీరిన కాంగ్రెస్ పేదల సొంతింటి కల నెరవేర్చేలా ఇందిరమ్మ ఇంటి పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇల్లెందు పట్టణంలోని 24 వార్డుల్లో తొలి విడతగా 357 మంది ఇళ్లు మంజూరయ్యాయి. అయితే, తొలుత నిర్మించుకోవాల్సి ఉండడం.. ఆతర్వాత ప్రభుత్వం దఫాలుగా రూ.5లక్షల మేర బిల్లులు ఇస్తామని చెప్పడంతో నిరుపేదలు ఆలోచనలో పడ్డారు. పెట్టుబడి ఎలా అనే ఆవేదనలో ఉన్న నేపథ్యాన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు సమాలోచనలు చేసి ఏపీకి చెందిన ఓ కాంట్రాక్టర్‌ను సంప్రదించగా మూకుమ్మడిగా ఇళ్ల నిర్మాణానికి అంగీకరించాడు.

రూపాయి పెట్టకుండానే...

గత రెండు నెలలుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు.. ఇళ్ల నిర్మాణం విషయమై ఏపీకి చెందిన ఓ కాంట్రాక్టర్‌తో సమాలోచనలు చేశారు. దీంతో లబ్ధిదారులు ఎలాంటి పెట్టుబడి పెట్టకుండానే తానే ఇంటి నిర్మాణం చేపడతానని.. ప్రభుత్వం నుంచి దశల వారీగా వచ్చే బిల్లులు తీసుకునేందుకు అంగీకరించినట్లు తెలిసింది. అంతేకాక ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల్లోనే ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా డిజైన్ సిద్ధం చేయించారు. ఆ కొలతల ప్రకారం ఇల్లెందు పట్టణంలో తొలి దఫా మంజూరైన 357 మంది ఇళ్లు నిర్మించాలనే నిర్ణయానికి ఇరువర్గాలు అంగీకారానికి వచ్చాయి.

అవగాహన.. ఒప్పందం



ప్రాజెక్టర్‌పై ప్రదర్శించిన ఇంటి నమూనా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు ముందుకొచ్చిన నేపథ్యాన రెండు రోజులుగా పట్టణ, మండల వ్యాప్తంగా లబ్ధిదారులను ఓ చోటుకు చేర్చి ప్రొజెక్టర్ ద్వారా ఇంటి నిర్మాణ డిజైన్.. అందుకు ఉపయోగించే సామగ్రి వివరాలపై అవగాహన కల్పించారు. దీంతో ఇల్లు మంజూరైనా చేతిలో చిల్లిగవ్వ లేక ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొన్న పేదలు సంతోషం వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్ ప్రకటించిన డిజైన్.. ప్రభుత్వం నుంచి బిల్లు వచ్చాకే తీసుకుంటానన్న మాటతో అంతా ఆనందంగా అంగీకరించారు.

మాకూ పని ఇవ్వండి

ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్ ముందుకు రాగా అవసరమైన మేస్త్రీలను తానే సమకూర్చుకునే అవకాశముంది. కేవలం కూలీలను మాత్రమే స్థానికులను తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. దీంతో తాము ఉపాధి కోల్పోతామని స్థానిక మేస్త్రీలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కాంట్రాక్టర్‌తో చర్చించినట్లు తెలిసింది. చివరకు స్థానిక మేస్త్రీలు కొందరికైనా అవకాశం ఇచ్చేలా చర్చలు జరుపుతుండగా.. నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ఎలా సాధ్యం?

ఇంటి నిర్మాణానికి దశల వారీగా ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేస్తుంది. లబ్ధిదారులు ఒక్కొక్కరుగా నిర్మించుకునేందుకు సామగ్రి కొనుగోలు చేస్తే భారం పడే అవకాశముంది. అదే కాంట్రాక్టర్ 357 ఇళ్ల నిర్మాణానికి ముందుకురావడంతో సిమెంట్, ఐరన్‌తో పాటు విద్యుత్ సామగ్రి, దర్వాజాలు, తలుపులు, కిటికీలు ఇలాంటివన్నీ మూకుమ్మడిగా కంపెనీల నుంచి నేరుగా కొనుగోలు చేసే అవకాశముంది. తద్వారా ధర తగ్గి కాంట్రాక్టర్ ప్రతీ ఇంటి ఉంచి కొంత మొత్తం మిగిలే అవకాశముంది. ఇక రూ.5లక్షలకు మించి వెచ్చించగలిగే స్తోమత ఎవరికైనా ఉంటే డిజైన్‌లో మార్పులు, ఉపయోగించే సామగ్రిలో మార్పులు చేసి అందుకు అయ్యే అదనపు నగదు తీసుకునేలా అంగీకారం కుదుర్చుకోనున్నారు. కాగా, ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల కోసం ప్రజాపాలన సభల్లో 7,200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని సొంత స్థలం ఉన్న వారు, స్థలం లేని వారు.. ఇలా రకరకాలుగా వర్గీకరించి 1,900 మందితో జాబితా రూపొందించారు. ఇందులో తొలి దశలో 357 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. అత్యధికంగా కొన్ని వార్డుల్లో 30మంది, తక్కువగా ఇంకొన్ని వార్డుల్లో ఐదుగురు చొప్పున లబ్ధిదారులు ఉన్నారు.

మాలాంటి వారికి మేలు



ఇల్లు మంజూరైనా నిర్మాణానికి చేతిలో చిల్లి గవ్వ లేదు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇంతలోనే కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణం చేసి ఇస్తామనే చర్చలు జరిగాయి. ఇదే జరిగితే మా కల నెరవేరినట్లే. ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లు కాంట్రాక్టర్‌కే ఇస్తాం. వేగంగా ఇల్లు కట్టించి ఇస్తే చాలు.

– స్వప్నబాయి పాసీ, కొత్త కాలనీ, ఇల్లెందు

సద్వినియోగం చేసుకోవాలి



ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు నిర్మించుకోలేకపోతే రద్దయ్యే ప్రమాదం ఉంది. అలా జరగకుండా కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ లెక్కల ప్రకారం అదే నిధులతో ఇల్లు పూర్తి చేయించాలనే ఆలోచనకు వచ్చాం. ఈ అవకాశాపికప సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– కోరం కనకయ్య, ఎమ్మెల్యే, ఇల్లెందు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఐటీసీ పీఎస్‌పీడీ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, కార్మికులు

బూర్గంపాడు: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఐటీసీ పీఎస్‌పీడీలో కార్మికులు పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీసీ పీఎస్‌పీడీ ఆధ్వర్యాన అడవుల పెంపకం, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు, కార్మిక సంఘాల నాయకులు కనకమేడల హరిప్రసాద్, గాదె రామకోటిరెడ్డి, యారం పిచ్చిరెడ్డి, గొనె రామారావు, సానికొమ్ము శంకర్‌రెడ్డి, బిజ్జం అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

మహబూబాబాద్‌రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. మూడేళ్ల బాలికపై 2018 ఏప్రిల్ 30న ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయగా.. స్థానిక పోలీసు అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అదే ఏడాది జూలై 19న కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ గణేశ్ ఆనంద్ వాదనలు వినిపించగా పోలీసులు 16 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్‌కు ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పొట్టకూటి కోసం వెళ్తూ అనంతలోకాలకు..

- ట్రాలీ ఆటోను ఢీ కొట్టిన ట్రావెల్ బస్సు
- ఒక మహిళ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన ట్రాలీ ఆటో



మృతురాలు అద్దంకి పద్మ(ఫైల్)

దమ్మపేట: పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్తున్న ఓ మహిళ మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతలోకాలకు చేరుకుంది. మండలంలోని మందలపల్లి గ్రామ శివారులోని చెరువు సమీపాన రాష్ట్రీయ రహదారిపై గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను పోలీసుల ఇలా తెలిపారు. సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామ పంచాయతీకి చెందిన నలుగురు మహిళలు, ఒక పురుషుడు మూడు చక్రాల ట్రాలీ ఆటోలో కూలీ పని నిమిత్తం సత్తుపల్లి నుంచి అశ్వారావుపేటకు గురువారం ఉదయం బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని మందలపల్లి గ్రామ శివారుకు చేరుకోగానే.. హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడగా.. అద్దంకి పద్మ (35) అక్కడికక్కడే మృతి చెందగా.. ముంగి గోపమ్మ, ముంగి మారేశ్వరిలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. గోపమ్మ, మారేశ్వరిలను ఖమ్మం తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి భర్త వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఊడిన టాటా ఏస్ స్టీరింగ్..

ఆరుగురికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో పడిపోయిన క్షతగాత్రులు

ఇల్లెందురూరల్/కారేపల్లి: గుండాల మండలం కాచనపల్లి గ్రామం నుంచి కారేపల్లి మండలం పోలెంపల్లి గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు టాటా ఏస్ వాహనంలో ఒక కుటుంబం గురువారం ఉదయం బయలుదేరింది. మార్గమధ్యలో ఇల్లెందు మండలంలోని రాజీవ్‌నగర్‌తండా శివారులో అకస్మాత్తుగా స్టీరింగ్ ఊడిపోవడంతో టాటాఏస్ వాహనం అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న పోలెబోయిన సుభద్ర, దొడ్ల నర్సమ్మ, రమేష్, పోలెబోయిన వెంకటనర్సు, పోలెబోయిన లక్ష్మి, డ్రైవర్ పూనెం కృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స చేసి తీవ్రంగా గాయపడిన సుభద్ర, నర్సమ్మ, వెంకటనర్సులను మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు సిఫారసు చేశారు. మిగిలిన నలుగురికి ఆస్పత్రిలో వైద్యసాయం అందించారు.

చికిత్స పొందుతూ ముగ్గురు వ్యక్తుల మృతి

➡ చండ్రుగొండ : మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఎదుళ్లపల్లి వెంకటేశ్వర్లు (60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గత నెల 29న రాత్రి తన ద్విచక్రవాహనంపై రావికంపాడు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు సూచన మేరకు తిరిగి కొత్తగూడెం తీసుకు రాగా అతడి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు నర్సింహారావు ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం రాత్రి తెలిపారు.

➡ దుమ్ముగూడెం: మండలంలోని మంగ్వాయిబాడ్వ గ్రామానికి చెందిన కల్లూరి కృష్ణ(60) పురుగుమందు తాగగా.. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణ భార్య గత 15ఏళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిస అయిన ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గత నెల 31న పురుగుమందు తాగగా.. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

➡ జూలూరుపాడు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కల్తీ వెంకటేశ్వర్లు (40) గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానంటూ కుటుంబసభ్యులను బెదిరిస్తుండేవాడు. ఈ క్రమంలో గత నెల 31 రాత్రి తన భార్యతో గొడవ పడిన ఆయన బయటకు వెళ్లి పురుగు మందుతాగి వచ్చినట్లు కుటుంబసభ్యులకు చెప్పాడు. దీంతో అతడిని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి, అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

అయ్యో జయశంకరా..!



జయశంకర్ సార్‌కు అవమానం జరిగింది. అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మరుగుదొడ్ల పక్కన ఇదిగో ఇలా నిర్లక్ష్యంగా పడేశారు. వెంటనే ఈ చిత్రపటాన్ని అక్కడ నుంచి తీసివేసి ఇలా మరోమారు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– అశ్వారావుపేట

దారి వివాదంలో ఘర్షణ..

- 9 మందికి గాయాలు

చండ్రుగొండ : మండలంలోని పోకలగూడెం గ్రామంలో దారి వివాదంలో గురువారం రాత్రి నెలకొన్న ఘర్షణలో ఓ వర్గానికి చెందిన 9 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బానోత్ లచ్చిరాం, గుగులోత్ జుమ్మ కుటుంబాల మధ్య దారి విషయమై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యాన బానోత్ లచ్చిరాం, బానోత్ నర్సింహ, అనసూర్యలు కలిసి మద్యం మత్తులో జుమ్మ కుటుంబీకులపై దాడికి దిగారు. కళ్లల్లో కారం చల్లి వారిపై మారణాయుధాలతో దాడి చేయగా.. జుమ్మ తలకు తీవ్ర గాయమైంది. అంతేకాక గుగులోత్ దేవి, కృష్ణ, బాల్య, మంగిత్యా, శ్రవణ్‌కుమార్, నవీన్‌కుమార్, నిఖిత్‌కుమార్, తేజస్విలకు గాయాలు కాగా వారిని 108లో చండ్రుగొండ పీహెచ్‌సీకి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి వివాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని వీ.కే.రామవరం శివారు ముర్రేడు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దీంతో ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా ఇసుక తోలకాలు చేపడుతున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో యువకుడు గల్లంతు

బూర్గంపాడు: గోదావరిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాకకు చెందిన ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుడు భోగపతి సావంత్(24) గురువారం ఉదయం తన స్నేహితుడితో కలిసి ఇరవెండి వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు సావంత్ గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని సావంత్ స్నేహితుడు గ్రామస్తులకు, కుటుంబసభ్యులకు తెలపగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గజ ఈతగాళ్లు, రెస్క్యూ టీమ్‌తో గాలింపు చర్యలు చేపట్టినా గురువారం రాత్రి వరకు అతడి ఆచూకీ లభించలేదు.

విపత్తు నివారణ చర్యలపై అవగాహన

ఖమ్మంసహకారనగర్: విపత్తు సమయాన చేపట్టాల్సిన నివారణ చర్యలపై గురువారం స్థానిక ఎస్‌బీఐటీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్), హైదరాబాద్ విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రామ్ పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమానికి జాతీయ విపత్తు నివారణ సంస్థ ఇన్‌స్పెక్టర్ గౌతమ్, వారి బృందం, జిల్లా విద్యాధికారి సామినేని సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విపత్తు సమయం చెప్పిరాదని, అది జరిగిన వెంటనే స్పందించేందుకు యువత ముందుండాలన్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. ఎన్‌డీఆర్ఎఫ్ సేవాలను కొనియాడుతూ.. గతేడాది ముంపు సమయాన యువత అందించిన సేవలను గుర్తుచేశారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం, వరదలు, భూకంపం వంటి విపత్కర పరిస్థితుల్లో అవలంబించాల్సిన కనీస ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన కలిగించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జి.రాజ్‌కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కవల దూడలు జననం..

కృత్రిమ గర్భధారణ ద్వారా ఓ ఆవు రెండు మగ దూడలకు జన్మనిచ్చింది. స్థానిక శ్రీనివాసకాలనీకి చెందిన కిలారు సత్యనారాయణ నివాసంలో గురువారం హెచ్‌ఎఫ్ జాతి ఆవుకు రెండు దూడలు జన్మించగా.. రెండూ ఆరోగ్యంగానే ఉన్నాయి. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మనించడం అరుదుగా జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

– పాల్వంచ



పురుగుల మందు తాగి ఆత్మహత్య



మృతుడు వీర్నాల సత్యనారాయణ(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఆసుపాక గ్రామానికి చెందిన వీర్నాల సత్యనారాయణ(27) గతకొద్ది నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లిన ఆయన గురువారం ఉదయం గుమ్మడవల్లి గ్రామ సమీపంలోగల పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టపై విగతజీవిగా మారాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.కాగా, మృతుడు మూడు నెలల క్రితమే సొంతింటిని నిర్మించుకోగా.. అప్పులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.